సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 19 । నవంబర్ । 2024



ఎయిర్‌పోర్ట్ సాధ్యమేనా?

తాడేపల్లిగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై వస్తున్న వార్తల నేపథ్యంలో అది సాధ్యమేనా అని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 8లో



ఉన్ని దుస్తులకు గిరాకీ

శీతాకాలం రాగానే ఉత్తర, ఈశాన్య భారతం నుంచి వచ్చిన వ్యాపారులు ఉన్ని దుస్తులు విక్రయిస్తారు. మూడు నెలల పాటు ఇక్కడే మకాం వేస్తారు. 8లో



వ్యాన్ బోల్తా.. వ్యక్తి మృతి

గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే వ్యాన్ కాల్వలో బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన కలిదిండి మండలం కొత్తూరులో చోటుచేసుకుంది. 8లో

న్యూస్‌రీల్

నరసాపురం డీఎస్పీగా శ్రీవేద



నరసాపురం: నరసాపురం డీఎస్పీగా డాక్టర్ డి.శ్రీవేద సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2022 బ్యాచ్‌కు చెందిన ఆమె అనంతపురం పోలీసు శిక్షణా కేంద్రంలో ట్రెనింగ్ పూర్తి చేసుకుని తొలి పోస్టింగ్‌లో ఇక్కడ నియమితులయ్యారు. శ్రీకాకుళంకు చెందిన ఆమె తండ్రి సూర్యప్రకాశరావు ఐపీఎస్ అధికారిగా సేవలందించారు. గతంలో ఏలూరు రేంజ్ డీఐజీగా కూడా పనిచేశారు. శ్రీవేద డెంటల్ సర్జన్‌గా వైద్య వృత్తిని కొనసాగించి గ్రూప్స్ ద్వారా పోలీసు శాఖకు ఎంపికయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ సమస్య నివారణ, అసాంఘిక కార్యక్రమాల అదుపునకు ప్రాధాన్యమిస్తామన్నారు. డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు ఆమెను కలిసి అభినందించారు.

ఇళ్ల స్థలాలు ఎప్పుడిస్తారు?



గూట్లపాడులో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఎన్నికల సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలపై చంద్రబాబు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. మండలంలోని గూట్లపాడులో సోమవారం ఇళ్ల స్థలాలపై ధర్నా చేశారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, తక్కువ ధరకే ఐరన్, సిమెంట్, ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కారు అధికారం చేపట్టి ఐదు నెలలు కావస్తున్నా నివేశన స్థలాలు, గృహ నిర్మాణంపై కార్యాచరణ చేపట్టకపోవడం దారుణమన్నారు. హామీ అమలు చేయకుంటే ఉద్యమానికి వెనుకాడబోమని హెచ్చరించారు. రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, జిల్లా సమితి సభ్యులు తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని కామేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంతో మూడు గ్రామాలకు ఇబ్బందులు



వదర్లపాడులో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కైకలూరు: మద్యం దుకాణం ఏర్పాటుతో మూడు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడతారంటూ సోమవారం వదర్లపాడు గ్రామంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. వదర్లపాడు శ్మశాన వాటిక సమీపంలో రైస్‌మిల్లు వద్ద మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తుండగా సర్పంచ్ వడుపు లక్ష్మీ నాగదేవి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వదర్లపాడు, నరసాయిపాలెం, శీతనపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బంది పడతారని, ఇటుగా విద్యార్థులు పాఠశాలలకు వెళతారన్నారు. సమీపంలో ఆలయాలు కూడా ఉన్నాయన్నారు. విషయం తెలిసిన కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎస్‌కే రమేష్, ఎస్సై ఆదినారాయణ ఇక్కడకు వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పడంతో నిరసన విరమించారు.

16 ఫిర్యాదుల స్వీకరణ



బాధితుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 16 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, ఆస్తి, భూతగాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలపై ఫిర్యాదులు అందాయి. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అయినా..
విశ్రాంతి లేదు

రిటైర్డ్ ఉద్యోగులకు పరీక్షే

- పెన్షన్ మంజూరు సమయం 90 రోజులకు పెంపు
- ఫ్యామిలీ పెన్షన్ సైతం 6 నెలలకు పొడిగింపు
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసమూ తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఆందోళన
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 45 రోజుల్లోనే పరిష్కారం
- ఉమ్మడి జిల్లాలో 38 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు

ఏలూరు(మెట్రో) : ప్రభుత్వ ఉద్యోగంలో సుదీర్ఘ సేవలందించి 62 ఏళ్ల వయసులో ఉద్యోగ విరమణ చేసిన రిటైర్డ్ ఉద్యోగులకు కూటమి సర్కారు పరీక్ష పెడుతోంది. త్వరలో పెన్షన్ అందుతుంది, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చేతికి వస్తాయని ఎదురుచూసే ఉద్యోగులకు షాకిచ్చింది. ముదిమి వయసులో ఆనందంగా రిటైర్ అవుతున్న ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది. గతంలో ఎన్నడూలేని విధంగా ఉద్యోగులను ఇబ్బందులు పెట్టేలా చర్యలు తీసుకోవడంపై అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ మంజూరు, ఫ్యామిలీ పెన్షన్ మంజూరు సమయాలను పెంచడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అలవికాని హామీలతో..

ఎన్నికల సమయంలో కూటమి సర్కారు అన్ని వర్గాలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తాం, కానుకలు ఇస్తాం అని అలవికాని హామీలను ఇచ్చింది. ఉపాధ్యాయ, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి వాగ్దానాలు గుప్పించింది. తీరా అధికారం చేపట్టిన తర్వాత నమ్మి ఓటేసిన వారిని నిండా ముంచింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటివరకు ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చని సీఎం చంద్రబాబు తాజాగా రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ మంజూరు వ్యవధిని రెట్టింపు చేశారు. ఈ నిర్ణయంతో పదవీ విరమణ తర్వాత పెన్షన్, ఇతరత్రా ప్రయోజనాల కోసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

2 నెలల్లో.. 2,800 మంది..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది సుమారు 48 వేల మంది ఉన్నారు. ఏలూరు జిల్లాలో 20 వేల మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 18 వేల మంది విధులు నిర్వహిస్తున్నారు. గత రెండు నెలల కాలంలో ఏలూరు జిల్లాలో సుమారు 1,000 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 800 మంది ఉద్యోగ విరమణ పొందారు. వీరికి పెన్షన్ ప్రతిపాదనలను విజయవాడ కార్యాలయానికి పంపించి అక్కడి నుంచి సర్వీసు పెన్షన్, ఫామిలీ పెన్షన్‌లను మంజూరు చేయాల్సి ఉంటుంది. సర్వీస్ పెన్షన్ మంజూరు కోసం 45 రోజులు, ఫ్యామిలీ పెన్షన్ కోసం 90 రోజులు వ్యవధి ఉండగా.. కూటమి ప్రభుత్వం ఈ సమయాన్ని రెట్టింపు చేసింది. సర్వీస్ పెన్షన్ కోసం 90 రోజులు, ఫ్యామిలీ పెన్షన్ కోసం 180 రోజులు గడువు పొడిగించడంపై రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం దాదాపు 180 రోజులపాటు ఎదురుచూపులు తప్పవని అంటున్నారు. ఏళ్లపాటు విధులు నిర్వహించి గౌరవంగా ఉద్యోగ విరమణ చేసిన తమకు రావాల్సిన ప్రయోజనాల విషయంలో ఇలా చేయడం తగదని వాపోతున్నారు.



కుటుంబ సభ్యులకూ పాట్లు

ఉద్యోగి భార్య లేదా భర్త లేదా పిల్లలకు పెన్షన్ ఇవ్వడాన్ని ఫ్యామిలీ పెన్షన్‌గా వ్యవహరిస్తారు. ఫ్యామిలీ పెన్షన్‌ను గత ప్రభుత్వంలో 90 రోజుల్లోపు ప్రభుత్వం ఆమోదించేది. ప్రస్తుత కూటమి సర్కారులో 180 రోజులకు పెంచడంతో మరణించిన ఉద్యోగి కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. తమ కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన పెన్షన్ కోసం ఆరు నెలలు ఎదురు చూడాల్సిందేనని అంటున్నారు.

రక్తనిధి కేంద్రం ప్రారంభం



రాయలంలో రెడ్‌క్రాస్ సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం అర్బన్: రక్తనిధి కేంద్రాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలోని రాయలం గ్రామంలో సోమవారం నూతన రక్తనిధి కేంద్రాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ రెడ్డితో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ నిధులు రూ.2.50 కోట్లతో ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటుచేశారన్నారు. దీంతో జిల్లాలో మొత్తం మూడు బ్లడ్ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ 59 రక్తనిధి కేంద్రాలు ఏర్పాటుచేయగా రాష్ట్రంలో 18 ఉన్నాయన్నారు. త్వరలో రూ.60 లక్షల విలువైన మొబైల్ బ్లడ్ డోనార్ వాహనాన్ని జిల్లాకు సమకూరుస్తామన్నారు. భీమవరం శాఖ చైర్మన్ ఎంఎస్‌వీఎస్ బద్రిరాజు, కోళ్ల నాగేశ్వరరావు, సోమరాజు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు రాజకీయ అండ

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ శ్రేణుల దాడి
- పోలీసులు అరెస్ట్ చేయకపోవడంపై అనుమానాలు



ఏలూరులో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త చందూ

చాట్రాయి : మండలంలోని పోతనపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కాణంగుల చందూపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపర్చి మూడు రోజులు గడిచినా నిందితులను పోలీసులు అరెస్ట్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిందితులకు రాజకీయ అండదండలు ఉండటంతో పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈనెల 15న మంకొల్లుకి చెందిన టీడీపీ కార్యకర్తలు బి.మధు, మరో నలుగురు కలిసి చందూపై రాడ్లతో దాడి చేసి కాళ్లు, చేతులు విరగ్గొట్టారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడి వాంగ్మూలం తీసుకుని 108లో చింతలపూడి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చందూను ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం బాధితుడు ఏలూరులో చికిత్స పొందుతున్నాడు. నిందితులు గ్రామంలో తిరుగుతున్నా పోలీసులు అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై ఎస్సై రామకృష్ణను వివరణ కోరగా కేసు నమోదు చేశామని, ఆస్పత్రి నుంచి బాధితుడి మెడికల్ రిపోర్ట్ రాలేదని వచ్చిన తర్వాత నిందితులను రిమాండ్‌కు పంపిస్తామని చెప్పారు.

గడువులోపు పరిష్కారం చూపాలి

కలెక్టర్ నాగరాణి



భీమవరం కలెక్టరేట్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్) : మీకోసంలో వచ్చిన ఫిర్యాదులకు పూర్తిస్థాయిలో గడువులోపు పరిష్కారం చూపాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే అర్జీలు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు. అనంతరం ఆమె జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాల జారీ చేశారు.

అర్జీల్లో కొన్ని..

- ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సమయంలో రైతు సేవా కేంద్రాల్లో నిర్ధారించిన తేమ, నూకశాతాన్ని మిల్లర్లు పరిగణలోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతుల సంఘం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.
- భీమవరంలోని గరగపర్రు రోడ్డు బైపాస్ నాలుగు రోడ్ల కూడలి వద్ద మద్యం షాపు ఏర్పాటుతో ఇబ్బంది పడుతున్నామని, దానిని తొలగించాలని స్థానికులు ఎం.సత్యకుమారి, ఆర్.మంగతాయారు వినతిపత్రం సమర్పించారు.
- అత్తిలి మండలం తిరుపతిపురంలో 45 ఎకరాలకు సాగునీరు అందించే బోదే ఆక్రమణకు గురైందని నాగకరుణ కుమారి అనే మహిళ ఫిర్యాదు చేశారు.
- జిల్లాలోని పలువురు దివ్యాంగులు తమకు సామాజిక పింఛన్ మొత్తాన్ని పెంచాలని, ఉపాధికి పంచాయతీ షాపులను అద్దెకు ఇప్పించాలని అభ్యర్థించారు.

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామంలో అభిషేకాలు



భీమవరం (ప్రకాశం చౌక్) : సోమేశ్వరుడు



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

జయ జయ మహాదేవ.. శంభో సదాశివ

హరహర మహాదేవ స్మరణలు మార్మోగాయి. కార్తీకమాస సోమవారం కావడంతో జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. నదీ స్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలు వదిలారు. జిల్లాలో పంచారామాలు, పట్టిసీమ తదితర క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

–సాక్షి, నెట్‌వర్క్

ఆశావర్కర్ల నిరసన గళం



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

భీమవరం(ప్రకాశం చౌక్): కనీస వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రూపు బీమా, నాణ్యమైన ఫోన్స్, యూనిఫాం, సెలవులు తదితర డిమాండ్లపై ఆశావర్కర్లు భీమవరం కలెక్టరేట్ వద్ద సోమవార భారీ ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో తమ సమస్యలపై అధికారులు చర్చించి రాతపూర్వకమైన హామీ ఇచ్చారని, అయితే వాటిని అమలు చేయడం లేదన్నారు. తమపై పని ఒత్తిడి, రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని, కొన్ని చోట్ల పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్‌లో జిల్లా వైద్యశాఖాధికారుల సమక్షంలో జరిగిన సమావేశంలో ఇచ్చిన ఉత్తర్వుల అమలులోనూ తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. వీహెచ్ఎస్ఎన్‌సీ కమిటీల ద్వారా ఆశావర్కర్ల తొలగింపును వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ లక్ష్మి, జిల్లా సెక్రటరీ డి.జ్యోతి తదితరులు నాయకత్వం వహించారు. జిల్లావ్యాప్తంగా ఆశావర్కర్లు తరలివచ్చారు.

అట్టహాసంగా ప్రభోత్సవం





ద్వారకాతిరుమలలో తిరుగాడుతున్న శివయ్య అశ్వరథం, వాహనంలో ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న భ్రమరాంబ, మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి రథోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయంలో శివయ్యకు విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి అశ్వ వాహన రథంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి దంపతులు రథం వద్ద కొబ్బరికాయలు కొట్టి బలిహరణ సమర్పించారు. అనంతరం రథోత్సవం ప్రారంభమైంది. స్వామివారు క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా అశ్వరథంపై ఊరేగారు. రథం వెనుక ప్రభ వాహనం భక్తులకు కనువిందు చేసింది. శివయ్య, అఘోరాల వేషధారణలతో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

67,793 మంది పట్టభద్రుల నమోదు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టభద్రుల ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్ నాగరాణి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాపై ఆమె సమీక్షించారు. జాబితాపై అభ్యంతరాలు ంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని, ఈనెల 6వ తేదీతో ఫారం–18, 19 స్వీకరణ గడువు ముగిసిందన్నారు. ఈనెల 20న డ్రాఫ్ట్ రోల్ ప్రచురణ, 23న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకటన, నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు క్లయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని వివరించారు. జిల్లాలో 67,793 మంది ఓటుకు నమోదు చేసుకున్నారన్నారు. గత ఎన్నికల్లో 65 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రస్తుతం అదనంగా 25 కేంద్రాలు అవసరం ఉంటుందన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల ఆక్రందన



కలెక్టరేట్ వద్ద దీక్ష చేస్తున్న 108 ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): తమ సమస్యలు పరిష్కరించాలంటూ 108 సర్వీసుల ఉద్యోగులు భీమవరం కలెక్టరేట్ వద్ద సోమవారం ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 108 ఉద్యోగులు కొద్దిరోజులు నిరసనలు తెలుపుతున్న సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించకుంటే ఈనెల 25వ తేదీ తర్వాత సమ్మెకు వెళతామని ప్రకటించారు. సమ్మె కారణంగా ప్రజలకు జరిగే అసౌకర్యానికి పూర్తి బాధ్యత యాజమాన్యం, ప్రభుత్వం వహించాల్సి ఉంటుందన్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రోజుకు మూడు షిఫ్టులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని, 108 వాహనాలకు శాశ్వత భవనాలు ఏర్పాటుచేయాలని కోరారు. వేతన బకాయిలను పూర్తిగా చెల్లించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

అవినీతి ఆరోపణలపై డీఎస్పీ విచారణ

తణుకు: తణుకు మండలం వేల్పూరులో గేదెల అపహరణ కేసులో పోలీసు స్టేషన్‌లో లక్షలు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సోమవారం పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ తణుకు రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. అత్తిలి మండలం బల్లిపాడుకు చెందిన ఆకుల మారుతీ అయ్యన్నరావుకు చెందిన రెండు గేదెలను వీరభద్రపురం గ్రామానికి చెందిన చికెన్ వ్యాపారి బండి ఈశ్వరరావు అపహరించుకుపోయాడు. దీనిపై కేసు నమోదు చేసిన తణుకు రూరల్ పోలీసులు రికవరీ పేరుతో బాధితుడు అయ్యన్నరావుకు రూ.5 లక్షలు అందజేశారు. అయితే ఈశ్వరరావు వద్ద రూ.13 లక్షలు తీసుకున్నారని.. తనకు రూ. 5 లక్షలు మాత్రమే ఇచ్చారని బాధితుడు అయ్యన్నరావు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఈశ్వరరావు, అయ్యన్నరావు మధ్య గతంలో ఆర్థిక లావాదేవీలు ఉన్నట్లు సమాచారం.

వ్యాన్ బోల్తా



భీమవరం మండలం రామాయణపురం వద్ద కాలువలో బోల్తా పడిన ఆటో వ్యాన్

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో వంతెనకు అప్రోచ్ లేకపోవడంతో సోమవారం ఆటో వ్యాన్ బోల్తా పడింది. వ్యాన్‌లో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. గొల్లవానితిప్ప నుంచి చేపల లోడుతో ఆటో వ్యాన్ రామాయణపురం వైపునకు వంతెనపై నుంచి దిగుతుండగా అదుపుతప్పి పంట కాలువలో పడిపోయింది. డ్రైవర్ సమయ స్ఫూర్తితో కిందకు దిగడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వ్యాన్‌లో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత



బంగారు గొలుసును అందజేస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

కొయ్యలగూడెం: పోగొట్టుకున్న బంగారు గొలుసును రికవరీ చేసి బాధితునికి అందజేశారు. కొయ్యలగూడెంకు చెందిన గొలిశెట్టి ఉషారాణి సోమవారం స్వీట్‌షాప్‌కు వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా మెడలోని మూడు కాసుల బంగారు గొలుసు పడిపోయింది. గొలుసు కొయ్యలగూడెంకి చెందిన మరో మహిళ ఆకుల లక్ష్మికి దొరికింది. ఇంటికి వెళ్లి చూసుకున్న ఉషారాణి గొలుసు కనిపించక పోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వి.చంద్రశేఖర్, ఈ–కాప్ కానిస్టేబుల్ సీహెచ్ గణేష్‌లు విచారణ చేపట్టారు. సీసీ పుటేజీలను పరిశీలించగా గొలుసు తీసుకున్న మహిళను గుర్తించి రికవరీ చేశారు. అనంతరం బాధితురాలికి దానిని అందజేశారు.

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ సాధ్యమేనా?

- 1100 ఎకరాల అటవీ భూముల్లో నిర్మించాలనే ప్రతిపాదన
- అటవీ భూమిలో నిర్మాణంపై పలు సందేహాలు



గూడెంలోని పాత విమానాశ్రయం(ఫైల్)



గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి ప్రతిపాదించిన భూములు

తాడేపల్లిగూడెం: గూడెంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై వస్తున్న వార్తల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యమేనా అని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా కేంద్రం ప్రకటించిన ప్రతిపాదిత విమానాశ్రయాల్లో తాడేపల్లిగూడెం ఒకటి. అటవీ భూముల్లో సుమారు 1100 ఎకరాలకు పైగా కేటాయించి విమానాశ్రయం నిర్మించాలనేది ఈ ప్రతిపాదన సారాంశం. గూడెంలో విమానాశ్రయ నిర్మాణం ఈ నాటిది కాదు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఇక్కడ సుమారు 653 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం ఉంది. 1.90 కిలోమీటర్ల పొడవున, సుమారు 28 ఎకరాల విస్తీర్ణంలో రన్‌వే ఉంది. వైఎస్ తొలిసారి సీఎం అయ్యాక ఇక్కడ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని అప్పటి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ ప్రతిపాదన చేశారు. టెండర్ల వరకు వ్యవహారం వెళ్లింది. ఏవియేషన్ నిబంధనల ప్రకారం విండ్ క్లియరెన్సు సర్టిఫికెట్ ఉండటంతో విమానాశ్రయ ఏర్పాటుకు సత్యం కంప్యూటర్స్‌కు చెందిన మైటాస్ కంపెనీ టెండరు దక్కించుకుంది. సత్యం కంప్యూటర్స్ స్కామ్ నేపథ్యంలో విమానాశ్రయం ఏర్పాటుకాలేదు.

అటకెక్కిన కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదన

పైడికొండల మాణిక్యాలరావు దేవాదాయ శాఖ మంత్రిగా ఉండగా కార్గో విమానాశ్రయానికి ప్రతిపాదన చేశారు. అమెరికాలో ఉంటున్న భీమవరానికి చెందిన కుటుంబం బిల్డ్ అండ్ ఆపరేట్ పద్ధతిలో విమానాశ్రయం నిర్మించడానికి ఆమోదం తెలిపింది. అయితే అది కూడా రన్‌వే మీదకు ఎక్కలేదు. ఇదే సమయంలో విమానాశ్రయ భూముల్లో రన్‌వేతో సహా 171.80 ఎకరాల భూమిని ఏపీ నిట్‌కు కేటాయించారు. ఈ రెండు ప్రతిపాదనలు విజయవంతం కాకపోవడంతో ఇజ్రాయెల్ సహకారంతో వెంకట్రామన్నగూడెంలోని కేంద్ర అటవీ పర్యావరణ ప్రాంతంలో ఉన్న భూముల్లో పైలట్ రహిత విమాన విడిభాగాల తయారీ కేంద్రం ఏర్పాటుతో పాటు విమానాశ్రయ నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. అప్పటి కేంద్ర విమానయాన మంత్రి అశోకగజపతిరాజు భూమి ఇస్తే విమానాశ్రయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సివిల్ ఏవియేషన్ పాలసీ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రీజనల్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంటు ఫండ్ కింద రూ.100 కోట్లను కార్పస్ ఫండ్‌గా కేటాయించింది. చివరకు ఆ ప్రతిపాదన ఫలించలేదు. ఉంగుటూరు, నాచుగుంట, గోపీనాథపట్నం పంచాయతీలు తమ పంచాయతీ పరిధిలోని అటవీ భూములను విమానాశ్రయ నిర్మాణానికి వినియోగించుకోవచ్చని తీర్మానాలు చేశాయి.

ఎయిర్‌పోర్టు ఇక్కడ సాధ్యమేనా?

తాడేపల్లిగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలంటే గూడెం, ఉంగుటూరు నియోజకవర్గాలలో విస్తరించి ఉన్న కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని సుమారు 3033 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని డీ నోటిఫై చేసి ఇవ్వాలి. వైఎస్ హయాంలో ఏర్పాటైన డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ కోసం అప్పటి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ 50 ఎకరాలు అదనంగా కావాలనే ప్రతిపాదన చేశారు. అప్పటి రాష్ట్ర అటవీ పర్యావరణ, వ్యవసాయ శాఖ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రఘువీరారెడ్డి వర్సిటీని సందర్శించారు. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి హోదాలో జై రాం రమేష్ ఈ భూమిని కేటాయిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. బెంగళూరులోని చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు కార్యాలయం చుట్టూ సంబంధిత ఫైల్ చక్కర్లు కొడుతోంది. భూమిని ఇన్ని సంవత్సరాలు గడిచినా కేటాయించలేదు. ప్రస్తుతం హల్‌చల్ చేస్తున్న గూడెంలో విమానాశ్రయం ఏర్పాటు ఈ దశలో వర్కవుట్ అవుతుందా? అనే చర్చ సాగుతోంది.

జిల్లా జైలును సందర్శించిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి



జిల్లా జైలులో ఆహార పదార్థాల నాణ్యత పరిశీలిస్తున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం ఏలూరులోని జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయం చేస్తుందని తెలిపారు. ఖైదీలతో మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసులు వాదిస్తుందని, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలు పొందడంలో అండగా ఉంటుందని చెప్పారు. వచ్చే నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని రాజీయోగ్యమైన కేసులలోని ముద్దాయిలు సమస్యను పరిష్కరించుకొని కేసు నుంచి విముక్తి పొందాలని సూచించారు.

ఎక్సైజ్ తనిఖీల్లో వ్యక్తి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో సోమవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కేఎస్‌వీ.కళ్యాణ్ చక్రవర్తి వివరించారు. తనిఖీల్లో ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారిణులు

ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన ఐదుగురు క్రీడాకారిణులు ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు, కోశాధికారి కె.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో పి.జయశ్రీ,, డి.సాయిభవాని, దేవిశ్రీ, ఏ.ఋత్విక, జి.పూజిత ఉన్నారని వివరించారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చాటారని గుర్తు చేశారు. దీంతో వీరు ఈ నెల 20 నుంచి 26 వరకూ పాటియాలలో జరిగే 68 వ జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.సాంబశివరావు అభినందించారు.

ఉన్ని దుస్తులకు గిరాకీ



ఏలూరులో వెలసిన ఉన్ని దుస్తుల దుకాణం



ఆకట్టుకునేలా రగ్గులు

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో స్వెటర్లు, మంకీ క్యాప్‌లకు డిమాండ్
- ఏలూరులో పలు చోట్ల వెలసిన దుకాణాలు

ఏలూరు (టూటౌన్): శీతాకాలం రాగానే నగరాలు, పట్టణాల్లో ఉన్ని దుస్తుల దుకాణాలు వెలుస్తాయి. ఉత్తర, ఈశాన్య భారతం నుంచి వచ్చి వీరు దాదాపు మూడు నెలలు ఇక్కడే ఉండి ఉన్ని దుస్తుల అమ్మకాలు చేస్తారు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్‌లు, రగ్గులు ఇలా మనకు శీతాకాలంలో కావాల్సిన అన్ని దుస్తులు వీరి వద్ద అందుబాటులో ఉంటాయి. ఒడిశా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాలతో పాటు నేపాల్ నుంచి వచ్చిన వ్యాపారులు ఏలూరులోని పలు ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్నారు.

నాణ్యత, డిజైన్‌ను బట్టి స్వెట్టర్ రూ.300 నుంచి రూ.700 వరకు ధర పలుకుతుంది. మంకీ క్యాప్‌లు రూ.70 నుంచి రూ.150, చేతి గ్లౌజులు రూ.100, రగ్గులు రూ.800 నుంచి రూ.1500 వరకు ధర పలుకుతున్నాయి. ముడి సరుకుల ధరలు పెరుగుదల కారణంగా గత ఏడాదితో పోలిస్తే ఈ సారి రేట్లు కొంత మేర పెరిగాయని విక్రయదారులు, కొనుగోలుదారులు చెబుతున్నారు.

ఏలూరు నగరంలో ఎక్కువగా కెనాల్ రోడ్డులో ఈ దుకాణాలు దర్శనమిస్తున్నాయి. నవంబరు నెల ప్రారంభం నుంచి ఈ దుకాణాలను ఏర్పాటు చేసినా మొదటి పదిరోజులు అమ్మకాలు అంతంతమాత్రమే. గత నాలుగు రోజుల నుండి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో అమ్మకాలు పెరిగాయి. దీంతో సాయంత్రం అయితే ఈ మార్గం కొనుగోలుదారులతో సందడిగా మారుతోంది.

జనవరి చివరి వరకు అమ్ముతాం



ఏటా ఏలూరు నగరానికి ఉన్ని దుస్తుల అమ్మకం కోసం మధ్యప్రదేశ్ నుంచి వస్తాం. నవంబరు ప్రారంభంలో వచ్చి జనవరి చివరికి మా స్వగ్రామం వెళతాం. గత పది రోజులుగా సరిగా అమ్మకాలు లేవు. ఇప్పుడే మొదలవుతున్నాయి. ఇక్కడి ప్రజల ఆదరణ, మాట తీరు బాగుంది. తిరిగి వెళ్లేటప్పుడు సొంత ప్రాంతాన్ని వదిలి వెళ్తున్న భావన కలుగుతుంది.

జి.చంద్ర సింగ్, మధ్యప్రదేశ్, అమ్మకందారుడు

ఏటా ఉన్ని దుస్తులు కొంటాం



ఏటా శీతాకాలం ఏలూరులో అమ్మే స్వెట్టర్ల దుకాణంలో మా కుటుంబానికి అవసరమైన వాటిని కొనుగోలు చేస్తుంటాం. మంకీ క్యాప్‌లు, చెవులకు పెట్టుకునే పట్టీలు, మఫ్లర్‌లు తప్పనిసరిగా కొంటాం. స్వెట్టర్లు, రగ్గులు అవసరం మేరకు కొనుగోలు చేస్తాం. నలుగురు ఉన్న మా కుటుంబంలో ప్రతీ సీజన్‌లో ఏదో రకం ఐటెమ్ కొనుగోలు చేయడం అలవాటు.

వెంపా విజయలక్ష్మి, మల్కాపురం, ఏలూరు రూరల్ మండలం

ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఉన్ని దుస్తులకు డిమాండ్

గత నాలుగు రోజుల వరకు ఏలూరు నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 20 నుంచి 23 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో అందరూ ఉన్ని దుస్తులకు ప్రాధాన్యమిస్తున్నారు. రాత్రి పూట ప్రయాణం చేసే వాహనదారులు తప్పనిసరి ఉన్ని దుస్తులు వాడాలి. నగరంలోని పలు మాల్స్, వస్త్ర దుకాణాల్లో సమీప ప్రాంతాల నుంచి వచ్చి పని చేస్తుంటారు. వీరి విధులు ముగిసేసరికి రాత్రి 8 నుంచి 9 గంటలవుతుంది. వీరంతా ఆ సమయంలో తప్పనిసరిగా ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇలాంటి వారు చలి నుంచి రక్షణ కల్పించే దుస్తులను తప్పనిసరిగా ధరించాలని వైద్యులు చెబుతున్నారు.



మంకీ క్యాప్, చెవులకు కట్టుకునే పట్టీలు

పంట ధ్వంసంపై కేసు నమోదు

టి.నరసాపురం: పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, పంటను ధ్వంసం చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వి.జయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బంధంచర్ల గ్రామానికి చెందిన బేతి సరోజినికి గ్రామంలో 5.08 ఎకరాల మెరక భూమి ఉంది. ఈ భూమిలో కుటుంబసభ్యులతో కలిసి పొగాకు పంట సాగు చేసుకుంటోంది. ఈ నెల 16న పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బేతి శేషయ్య, సిరింగుల సునీల్, బేతి సత్యనారాయణ, కాంతారావు, బేతి పెద్దపుల్లయ్య, బేతి జాన్, బేతి రాజులతో కలిసి సరోజిని పొలంలో ప్రవేశించి పొలంలో ఉన్న షెడ్డును ధ్వంసం చేసి, ట్రాక్టర్‌తో పంటను దున్నివేశారన్నారు. వ్యవసాయ పనిముట్లు ధ్వంసం చేయడంతో పాటు భయభ్రాంతులకు గురిచేశారన్నారు. చంపుతానని బెదిరించినట్లు సరోజిని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు

భీమవరం: వాకింగ్‌కు వెళ్తున్న తన నుంచి సెల్‌ఫోన్ దొంగిలించి పారిపోతున్న వ్యక్తిని పట్టుకోడానికి ప్రయత్నించగా బ్లేడ్‌తో దాడి చేసినట్లు పట్టణంలోని నాచువారి సెంటర్‌కు చెందిన నరహరిశెట్టి రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. రాజ్‌కుమార్ సోమవారం వీరమ్మ పార్క్ వద్దకు వాకింగ్‌కు వెళుతుండగా తణుకు పట్టణానికి చెందిన వరదా దినకరన్ రాజ్‌కుమార్ జేబులోని సెల్‌ఫోన్ దొంగిలించాడు. పట్టుకోడానికి ప్రయత్నించగా బ్లేడ్‌తో దాడిచేశాడు. అటుగా వస్తున్న మరో ఇద్దరు దినకరన్‌ను పట్టుకున్నారు. దినకరన్‌ను పోలీసుస్టేషన్‌లో అప్పగించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు కల్యాణ్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. మండలంలోని శ్రీనివాసపురానికి చెందిన తగరం కల్యాణ్ (31) పామాయిల్ తోటల్లో గెలల కోత పనులకు వెళ్తుంటాడు. సోమవారం శ్రీనివాసపురం శివారులో రైతు పొలంలో గెలల కోతకు కల్యాణ్ వెళ్లాడు. గెల కోస్తుండగా ఐరన్ పైపు తోట మీదుగా వెళ్లిన 11 కేవీ విద్యుత్ వైర్లకు తగలడంతో కల్యాణ్ విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి కళ్యాణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్సై జబీర్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

పరిశోధన రంగంలో స్వావలంబన



ఏపీ నిట్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదనరెడ్డి

తాడేపల్లిగూడెం: పరిశోధన, రక్షణ రంగాల్లో భారత్ స్వావలంబన దిశగా అడుగులు వేస్తుందని భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) శాస్త్రవేత్త, డిఫెన్సు మెటలర్జికల్ రీసెర్చ్ లేబరేటరీ పూర్వపు డైరెక్టర్ డాక్టర్ జి.మధుసూదన రెడ్డి అన్నారు. నిట్‌లో సోమవారం డీఆర్‌డీఓలో పరిశోధనలకు నిధులనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ వ్యవస్థలో డీఆర్‌డీఓ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రపంచ రక్షణ తయారీ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. డీఆర్‌డీఓ ఆధునిక ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, తేలికపాటి యుద్ధ విమానాలు, రాడార్లు, క్షిపణులు, రాకెట్‌లు , అధునాతనమైన వివిధ పరికరాలు తయారుచేస్తుందన్నారు. దేశ రక్షణ పరిశోధనలకు సంబంధించి ఎన్‌ఐటీల భాగస్వామ్యం ఉండాలన్నారు. విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలు చేస్తూ ప్రపంచం గర్వించే నూతన ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేయాలన్నారు. పరిశోధనలకు నిధుల సమీకరణ కొత్త ప్రాజెక్టులు, డీఆర్‌డీఓలో ఉద్యోగ అవకాశాలు వంటి విషయాలపై విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఎంఎంఈ విభాగాధిపతి డాక్టర్ రఫీ, డీన్‌లు శాస్త్రి, జయరామ్, కురుమయ్య, వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ వి.సందీప్, డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేశ్వరరావు, అల్లా భక్షు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తాపడి వ్యక్తి మృతి



ఘటన స్థలంలో మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



కలిదిండి మండలం కొత్తూరు కాల్వలో బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ల వ్యాన్

కలిదిండి(కై కలూరు): గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే వ్యాన్ కాల్వలో బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన కలిదిండి మండలం అమరావతి పంచాయతీ శివారు కొత్తూరులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలిదిండి గ్రామానికి చెందిన పోసిన శివనాగరాజు(28)కి ఏడాది క్రితం వివాహం జరిగింది. అతను ఇండియన్ గ్యాస్ కంపెనీ వ్యాన్‌లో సిలిడర్లను సరఫరా చేసేవాడు. సిలిండర్ల లోడుతో వెళుతూ వ్యాన్ అదుపుతప్పి కాల్వలో పడింది. వాహనం కింద డ్రైవర్ నాగరాజు ఉండటంతో ఊపిరాడక మృతి చెందాడు. కలిదిండి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పట్టిసంలో కార్తీక పూజలు



ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ క్షేత్రానికి చేరుకుంటున్న భక్తులు

పోలవరం రూరల్: కార్తీకమాసం సోమవారం కావడంతో పట్టిసం శివక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానమాచరించి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాకారంలో సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. శివక్షేత్రానికి వచ్చిన భక్తులకు దేవస్థానం అధికారులు అన్నప్రసాదాన్ని అందించారు.



వీరేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆయుధ పరిశ్రమ నిర్మాణం నిలిపివేయాలి

ఏలూరు (టూటౌన్): జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో 1500 ఎకరాల విస్తీర్ణంలో నావిక విభాగానికి అవసరమైన ఆయుధాల పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించాలని చూస్తున్నాయని దీన్ని తక్షణం నిలుపుదల చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సోమవారం బహిరంగ లేఖ రాసింది. వివరాలను సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి పత్రికలకు విడుదల చేశారు. ప్రజలు వద్దన్నా పరిశ్రమ పెట్టాలని చేస్తున్న ప్రయత్నాలను అంతా వ్యతిరేకిస్తున్నారని, ఈ పరిశ్రమను స్థాపిస్తే వంకావారిగూడెం పంచాయతీలోని 6 గ్రామాలకు చెందిన 3 వేల మంది నిరాశ్రయులవుతారని చెప్పారు. పరిశ్రమ స్థాపిస్తే పరిసర గ్రామాల ప్రజలపై నిఘా ఏర్పడుతుందని, వారు స్వేచ్ఛను కోల్పోవడంతో పాటు గాలి, నీరు, వాయువు కాలుష్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమ స్థాపిస్తే ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు దక్కుతాయని ప్రభుత్వాలు చెబుతున్నా వాస్తవానికి స్వీపర్, గేట్ కీపర్ లాంటి కొద్దిపాటి ఉద్యోగాలు తప్ప ఇంకేమీ రావన్నారు. ప్రైవేటు పరిశ్రమ కాబట్టి ఎలాంటి రిజర్వేషన్లు పాటించరన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టులో నిర్వాసితులైన లక్ష కుటుంబాల్లో కేవలం 10 వేల కుటుంబాలకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు, జల్లేరు రిజర్వాయర్, అభయారణ్యం బొగ్గగనుల పేరుతో అడవి బిడ్డలను ఆ ప్రాంతం నుంచి దూరం చేస్తున్నారన్నారు. ఆయుధ పరిశ్రమ పెట్టవద్దని గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానించారని, గ్రామ సభల తీర్మానం అంటే అది సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు.

ఈ తప్పు.. భావితరాలకు పెను ముప్పు

- రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకం
- రేపటి పౌరుల మనుగడపై తీవ్ర ప్రభావం
- పాలిథిన్ నిషేధం అమలు జరిగేనా?

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉదయం లేచింది మొదలు టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరణా సామాన్లు...ఒక్కటేమిటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకొస్తున్నాం. ఆఖరికి హోటల్ నుంచి తీసుకొచ్చే టీ తెచ్చుకునేందుకు సైతం పాలథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. అందుకే ఏఇంట్లో చూసినా ప్లాస్టిక్ కవర్లు నిండిపోతున్నాయి. వాటిని నిర్లక్ష్యంగా ఆరు బయట పాడేస్తుండడంతో రోడ్లు, వీధులే కాదు ఆఖరికీ డ్రైయినేజీలు, వంట కాలువలు సైతం ప్లాస్టిక్ కవర్లతోనే దర్శనమిస్తున్నాయి. ప్రజలంతా కొనసాగిస్తున్న ఈ తప్పు భావితరాలకు పెనుముప్పుగా మారుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులొచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

నిబంధనలు బేఖాతరు

పర్యావరణ పరిరక్షణ చట్టం –2021 ప్రకారం 50మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా నిషేధం. అంతకంటే తక్కువ మందమున్న వాటితో నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతుంది. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా సంచులను తయారు చేయాలని, ప్రతి సంచిపై తయారీ సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య, మందం వివరాలు విధిగా ముద్రించాలని ప్రభుత్వం నిర్దేశించింది. నిబంధనలు పాటించని కంపెనీలకు, వాటిని విక్రయించే వ్యాపారులకు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి. అయినా ఆచరణలో ఇవేమీ అమలు కావడం లేదు.


మునిసిపల్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు (ఫైల్)

పురపాలక సంఘం ఆధ్వర్యంలో దాడులు:

మరోవైపు గత కొన్ని రోజులుగా తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని హోల్ సేల్, రిటైల్ షాపులలో దాడులు నిర్వహించారు. షాపుల్లో అమ్ముతున్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, గ్లాసులు, పాయిల్స్, బిర్యానీ కప్‌లు తదితర ఇతర ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని వారికి జరిమాన విధించారు. అపరాధ రుసుం ద్వారా వసూలైన మొత్తాన్ని పురపాలక సంఘ ఖజానకు జమకట్టరు. షాపులు వద్ద స్వాధీనం చేసుకున్న 120 లోపు మైక్రాన్లు ప్లాస్టిక్‌ను పురపాలక సంఘం స్వాధీనం చేసుకుంది. ప్లాస్టిక్ అమ్మకం, వినియోగంపై మరిన్ని దాడులు చేస్తామని హోల్‌సేల్, రిటైల్, ఇతర షాపులు యజమానులను హెచ్చరించారు.

ప్లాస్టిక్ భూతాన్ని వదిలించాలి

మునిసిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ ఎం.ఏసుబాబు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ ఎస్‌వీ శ్రీమన్నారాయణ, శానటరీ ఇనెస్పెక్టర్ సోమేశ్వరరావులు మాట్లాడుతూ భూమిలో ఇంకకుండా ప్లాస్టిక్ అనేక అనార్థలకు దారి తీస్తుందని చెప్పారు. ప్లాస్టిక్ భూతాన్ని తప్పక తరిమికొట్టాలని, లేకపోతే ప్రాణాంతకంగా మారుతుందున్నారు. రాబోయే తరాలు ఎటువంటి అనార్థాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టీంలచే ప్రతి షాపువద్ద ప్లాస్టిక్ వినియోగం జరగకుండా చూస్తున్నట్లు చెప్పారు. ప్రజారోగ్యానికి హాని ఉన్నందున నిబంధనలకు అనుగుణంగా లేని పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యమివ్వాలి

గూడెం నియోజకవర్గంలో టౌన్, రూరల్, పెంటపాడు మండలాల్లో సుమారు 950 వరకు వివిధ దుకాణాలు ఉన్నట్లు అంచనా. ప్రతి షాపులోను పాలథీన్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ మట్టిలో కలిసి పోవాలంటే వందలు, వేల ఏళ్ల పడుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకానికి ప్రత్యామ్నాయంగా జనపనార, కాగితం కవర్లను వాడాలని ప్రభుత్వం సూచిస్తుంది. అటువంటి వాటితో తయారు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలంటే ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలనిపర్యావరణ వేత్త లు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేదాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తెరగాల్సిన అవసరముంది. ప్రజలు క్యారీబ్యాగ్‌లకు జనపనార, క్లాత్ కాగితంతో తయారుచేసిన కవర్లను వాడితే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుంది.


షాపులు వద్ద మునిసిపల్ సిబ్బంది దాడులు (ఫైల్)


షాపుల వారికి ఫైన్‌లు వేస్తున్న సిబ్బంది(ఫైల్)

క్లుప్తంగా

సత్యసాయి బోధనలు అనుసరణీయం


రథయాత్ర ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భగవాన్ సత్యసాయి బాబా బోధనలు అనుసరణీయమని సేవా సంస్థ కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు పేర్కొన్నారు. స్థానిక డీఎస్ చెరువు వద్ద శ్రీ సత్యసాయి సేవా సమితి మందిరంలో రథయాత్రను సోమవారం ప్రారంభించారు. సింగంశెట్టి విష్ణుమూర్తి సాయి పతాక ఆవిష్కరణ గావించారు. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని స్వామి వారి రథయాత్రను ప్రారంభించారు. సాయి నామ సంకీర్తనలు జరిగాయి.ఈ కార్యక్రమంలో సవీస్‌బాబా, ప్రవా శ్రీనివాస్, రుద్రసాయి, సంగీత విజయసాయి, డాక్టర్ దుర్గాదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం చేయాలి


తణుకు ఆర్టీసీ డిపోలోని కార్గో సెంటర్‌లో మాట్లాడుతున్న డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలు మరింత విస్తృతం చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. సమయపాలన మాసోత్సవాల్లో భాగంగా తణుకు డిపోలోని కార్గో కార్యాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ కార్గో కేంద్రానికి వచ్చే ప్రయాణికులు, వినియోగదారులకు సత్వరమే సేవలందించాలని సూచించారు. పార్సిల్స్ తీసుకునే క్రమంలో వినియోగదారుల మన్ననలు పొందాలని, బస్సుల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేసేప్పుడు సమయపాలన పాటించడం ద్వారా విలువైన సమయాన్ని వృధా కాకుండా చూడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

తణుకు అర్బన్: తణుకు జాతీయరహదారి సమీపంలో శ్రీధర్మ శాస్త్ర పంచాయతన అయ్యప్ప దేవాలయంలో సోమవారం రాత్రి ఘనంగా పడిపూజ నిర్వహించారు. గురుస్వామి వేమూరి చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడిపూజను తణుకుకు చెందిన ఉద్దగిరి సూర్యమాధవ్, లక్ష్మిశ్రావణి దంపతుల సౌజన్యంతో జరిపారు. నిత్య పూజారి సత్యనారాయణ సమక్షంలో స్వామివారు అధిరోహించే మెట్లను కన్నులపండువగా అలంకరించారు. పడిపూజలో మాలదారులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చక్రి, ప్రసాద్, రఘు, శ్రీనివాస్, అనిల్‌కుమార్ శివాజీ, నాగు, రాజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు నూతన అగ్రిమెంట్ చేయాలి

తణుకు: సివిల్ సప్లై హమాలీ కార్మికులకు వెంటనే నూతన అగ్రిమెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తణుకులోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ సివిల్ సప్లై కార్మికులకు 2024 జనవరిలో జరగాల్సిన నూతన రేట్లు పెంపుదల నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. సీఐటీయూ సీనియర్ నాయకులు గార రంగారావు, జట్టు మేస్త్రి ఎస్.చిన్నారావు, ఎ.నర్సింహమూర్తి, అనిల్ పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం పరిధిలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. డివిజన్‌లో వివిధ ప్రాంతాల నుంచి రెండు ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎంతో దూరం నుంచి సమస్యలు చెప్పుకుంటున్న ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

అక్రమంగా చేపల చెరువు సాగు

తణుకు: మండలంలోని మండపాకలో ఇరిగేషన్‌కు చెందిన మురుగు డ్రెయినేజీను ఆక్రమించి చేపల చెరువు తవ్వకాలు చేస్తున్నారు. గ్రామంలోని సత్యవాడ మురుగు డ్రెయినేజీ చెరువుగా తవ్వి చేప పిల్లలు వేసి మరీ పెంచుతున్నారు. స్మశాన వాటికను ఆనుకుని సుమారు ఎకరం పైగా విస్తీర్ణంలో అక్రమంగా చెరువు తవ్వుతున్నప్పటికీ అటు ఇరిగేషన్, ఇటు పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఈ విషయమై గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు బలుసు అప్పారావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన


వార్డుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటకజనిత వ్యాధులను నిలువరిద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలో ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 31, 32 వార్డులలో సోమవారం వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు జరిగాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమ కాటు నుంచి రక్షణ పొందేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు పలు క్షేత్ర స్థాయి పరిశీలనలు, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేసేందుకు కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశాలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రమణ, వెంకట లక్ష్మి, పార్వతి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్‌కు అభినందనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇటీవల ఏలూరులో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా కాన్ఫరెన్స్‌లో తాడేపల్లిగూడెం మహిళా వాకర్స్ అవార్డులు అందుకున్నారు. బెస్ట్ మహిళా సర్వీస్ క్లబ్, మోస్ట్ ఇన్వాల్డ్ అవార్డులను అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మికి అందజేశారు. ఫీడింగ్ హంగర్ క్యాంప్ మహిళా వాకర్స్ తదితర అవార్డులను అందుకున్నారు. పలువురు అభినందించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషల్ ప్రెసిడెంట్ వి.మురళీ మోహన్‌రావు, జిల్లా గవర్నర్ వై.సత్యనారాయణ, వనచర్ల నాగేంద్రప్రసాద్, ఇందిరా కుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక కాంతుల్లో శివయ్య


విశ్వేశ్వరస్వామిని విశేషంగా అలంకరించిన దృశ్యం


సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని వీరంపాలెం, కొండ్రుప్రోలు, అప్పారావుపేట, చినతాడేపల్లి, నవాబుపాలెం, జగన్నాథపురం, పెదతాడేపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలువురు మహిళలు ఆలయాల సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

భక్తజనంలో పోటెత్తిన శైవక్షేత్రాలు

అత్తిలి: కార్తీక మాసం మూడవ సోమవారం మండలంలోని శివాలయాలు భక్తజనంలో కిటకిటలాడాయి. ఆలయాల్లో హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తుల నామ స్మరణతో మారుమ్రోగాయి. అత్తిలిలో ప్రసిద్ధి చెందిన ఉమా సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ, సిద్ధేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా. దికాలను జరిపారు. భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు.

భవిత విద్యార్థులకు సహ పాఠ్యాంశాలపై శిక్షణ


భవిత సెంటర్‌లో దివ్యాంగులతో వ్యాయామం చేయిస్తున్న భవిత సెంటర్ నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక శిక్షణతో పాటు సహ పాఠ్యాంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు ప్రత్యేక ఉపాధ్యాయుడు బాలీశ్వరయ్య పేర్కొన్నారు. సోమవారం భవిత సెంటర్‌లో యోగ, వ్యాయామం, ఆట పాటలు, డాన్స్, వాకింగ్, డ్రాయింగ్, పెయింటింగ్‌లపై దివ్యాంగులకు శిక్షణ అందజేశారు. బాలీశ్వర్య మాట్లాడుతూ ప్రతి రోజు శిక్షణ ఇవ్వడం వల్ల దివ్యాంగుల పిల్లల్లో ఉన్న ప్రవర్తన సమస్యలు తగ్గి మంచి ప్రవర్తన, శారీరకంగానుు, వివిధ నైపుణ్యాలు అభివృద్ధి చెంది పాఠశాలకు వెళ్లి సాధారణ పిల్లలతో సమానంగా రాణిస్తారని చెప్పారు. భవిత సెంటర్ ద్వారా దివ్యాంగులకు అందుతున్న వివిధ సేవలపై అవగాహన కల్పించారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



ఇరగవరం సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఇరగవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఇరగవరంలో సీపీఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ అధికారి విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను మూడు సెంట్లుగా మార్చి ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందించాలని, ఇంత వరకు ఇంటి స్థలం లేని వారికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అడ్డాల సత్యనారాయణ, కూడిపూడి వెకంట రెడ్డి, గుడిమెట్ల కోటేశ్వరరావు, కోనా సాయిబాబు, గాలింకి వెంకటేశులు, కాటూరి రాముడు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన గనులు


పెంటపాడు: శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల క్విజ్ పోటీలలో పాల్గొన్న నిర్వాహకులు


తాడేపల్లిగూడెం(టీఓసీ): వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

పెంటపాడు: గ్రంథాలయాలు విజ్ఞాన గనులని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ నిర్ణేతగా వి. రామచంద్రా రెడ్డి వ్యవహరించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈనెల 20న ముగింపు వేడుకలు సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ లైబ్రేరియన్ జుల్ఫికర్ ఆలీ, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని న్యాయ నిర్ణేతలు గరికపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, కోపల్లె శ్రీనివాస్, ఏవీ లక్ష్మణరావు, వి.జాన్‌బాబు, వెంకటరత్నం, జయసుధలు పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయంలో సోమవారం వృక్షాలు–వాటి ఉపయోగాలపై ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థినీ, విద్యార్థులు వ్యాసరచన పోటీలు జరిగాయి. విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


తణుకు టౌన్: పురుషుల గ్రంథాలయంలో మాట్లాడుతున్న బుచ్చిబాబు

తణుకు టౌన్: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు కొనియాడారు. తణుకులోని జిల్లా పురుషుల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు పోరాట జీవితం- విద్యార్థులు పొందవలసిన స్ఫూర్తి అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి పోరాటాలను వివరించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎస్ విష్ణువర్ధన్, జర్నలిజం విద్యార్థినీ ఎల్ బాణుశ్రీ, తదితరులు మాట్లాడారు. ఈకార్యక్రమంలో కళాశాల విద్యార్థులు క్విజ్ పోటీలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కే సుగుణ కుమారి, జీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. తణుకు మహిళా గ్రంథాలయం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముత్యాల రుద్రయ్య, వాకలపూడి నాగేశ్వరరావు, పీ వీరరాఘవులు, ఆర్ సీతారామదాసు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


తాటిపర్రులో బాధిత కుటుంబ సభ్యుడికి ఆర్థికసాయం అందజేస్తున్న గౌడ సంఘ నాయకులు

తణుకు అర్బన్: ఉండ్రాజవరం మండలం తాటిపర్రు గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాద ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు గౌడ సంఘం తరపున ఆర్థిక సాయం అందజేశారు. వెలగదుర్రు గ్రామానికి చెందిన చిటికెన సుబ్బారావు రూ. 15వేలు, ఉండ్రాజవరం గౌడ సంఘం రూ. 50వేలు, సూర్యారావుపాలెం గౌడ సంఘ రూ. 28,500 ఇవ్వగా ఈ మొత్తంలో నలుగురు మృతుల కుటుంబాలకు రూ. 25వేలు చొప్పున, గాయపడిన బాధితుడికి రూ. 18,500 అందజేసినట్లు రాష్ట్ర గౌడ సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యులు వీరమల్లు ఫణీంద్రకుమార్ తెలిపారు. చివటం ఎంపీటీసీ వేముల వెంకట సత్యనారాయణ, వీరమల్లు బాలాజీ, మట్టా శ్రీనివాస్, చిటికెన వంశీప్రసాద్, వెంకట్రావు, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి


సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

పెంటపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన బీకేఎంయు జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామంలో ఎంతో కాలం నుంచి 523 మంది ఇళ్లులేని బాధితులు ఉన్నారన్నారు. వీరికి తక్షణం పెంటపాడు పరిసర ప్రాంతాలలో ఇంటిస్థలాలు అందజేయాలన్నారు. ఏపీ వ్యవసాయ కార్మికసంఘ నాయకులు బండారు శ్రీనివాసరావు, ఎం. నాగేశ్వరరావు, దిద్దే నాగేశ్వరరావు, కొణతాల నాగరాజు, ఎన్. దుర్గ, పి. కుమారి, కె. దుర్గ, బంకూరి లక్ష్మి పాల్గొన్నారు.

విమానగోపుర స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన వెలిశెట్టి మోహిరాస్కంద ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రా న్ని అందించారు.

కడియద్దలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద చెరువు గట్టున పునఃనిర్మించి శ్రీగణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల విగ్రహాలకు ధాన్యాధివాసం నిర్వహించారు.

ఈడూరు మలుపు వద్ద తొలగని ఆక్రమణలు




ఈడూరులో వరాల వెంకన్న ఆలయం ఎదురుగా మలుపు వద్ద ట్రాఫిక్ ఇక్కట్లు

- అవస్థలు పడుతున్న భక్తులు
- స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

అత్తిలి: ఈడూరులో వరాల వేంకటేశ్వర స్వామి వారి ఆలయం ఎదురుగా ప్రమాదకర మలుపులోఉన్న ఆక్రమణలపై విమర్శలు, ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు ఆక్రమణలు తొలగించకపోవడంతో ప్రతి శనివారం ఆలయానికి వచ్చే భక్తులకు అగచాట్లు తప్పడం లేదు. ఆర్అండ్‌బీ రహదారి మార్జిన్ వరకు పండ్లు, పూజా దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మలుపు వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించాలని గతంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పేరుగాంచిన వైష్ణవ క్షేత్రాల్లో ఒకటైన బుల్లితిరుపతిగా ప్రసిద్ధిగాంచిన వరాల వెంకన్న ఆలయానికి ప్రతి శనివారం సుదూర ప్రాంతాల నుంచి బస్సులు, ఆటోలు, కాలినడకన వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయం ఎదురుగాఉన్న రోడ్డు వెంబడి భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. ఆలయం ఎదురుగాఉన్న మలుపువద్ద కొబ్బరికాయలు, అరటి పండ్లు పూజా సామగ్రి దుకాణాలు మార్జిన్ వెంబడి ఏర్పాటు చేశా రు. ఆ మలుపువద్దే భక్తులు వేచిఉండి ఆటోలు, బస్సులపై ప్రయాణిస్తుంటారు. దీంతో ఇక్కడ ప్రతి శనివారం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్సులు, ఆటోలకోసం ఈ మలుపువద్ద భక్తులు వేచిఉండటంతో ఒక్కోసారి వాహనాలు అదుపుతప్పి ప్రయాణికులపై దూసుకువచ్చిన సందర్భాలు చోటు చేసుకున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఈ మలుపు వద్ద రోడ్డు మార్జిన్ వెంబడి ఉన్న దుకాణాలను వెనుకకు తరలించి, ట్రాఫిక్ సమస్యలేకుండా, ప్రమాదాల బారిన పడకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.